సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 18 । ఏప్రిల్ । 2024





న్యూస్‌రీల్

కొండగట్టులో న్యాయమూర్తుల పూజలు



పూజలు చేస్తున్న న్యాయమూర్తులు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామివారిని బుధవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేజిస్ట్రేట్లు దర్శించుకున్నారు. వేములవాడ మేజిస్ట్రేట్ జ్యోతి, సిరిసిల్ల మేజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్, కరీంనగర్ మేజిస్ట్రేట్ హేమలత, మంచిర్యాల మేజిస్ట్రేట్ స్వాతి అంజన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు వారి పేరున ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

లడ్డూ @ రూ.75వేలు



స్వామివారి లడ్డూతో దేవరాజు దంపతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా బుధవారం స్వామివారి లడ్డూకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వామివారి లడ్డూకు పోటాపోటీగా వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన తోట దేవరాజు రూ.75వేలకు స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు. కల్యాణ వేడుకల అనంతరం లడ్డూకు వేలం పాట నిర్వహించగా.. గ్రామస్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. స్వామి వారి లడ్డూ దక్కించుకుంటే శుభాలు, కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే నారాయణపూర్‌లోని స్వామి వారి లడ్డూకు డిమాండ్ ఉంటుంది. లడ్డూ దక్కించుకున్న తోట దేవరాజు దంపతులను ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, కమిటీ సభ్యులు సన్మానించారు.

కార్మికులు చస్తున్నా ప్రభుత్వం స్పందించట్లే..



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: పనుల్లేక నేతకార్మికులు చస్తున్నా ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు విమర్శించారు. సిరిసిల్లలోని కార్మికభవనంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, నేత కార్మికులకు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న ఎన్నికల్లో ప్రధాన పార్టీలు సిరిసిల్ల ప్రజల నిరసన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీ మేరకు 48 గంటల్లోపు పరిష్కరించాలని కోరారు. నల్ల చంద్రమౌళి, సోమ నాగరాజు, అజ్జ వేణు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



సురభీ హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై వివరిస్తున్న అధికారులు

సిరిసిల్ల: అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల ఫైర్ ఆఫీసర్ టి.నర్సింహాచారి సూచించారు. జిల్లా కేంద్రంలోని సురభీ, మహాలక్ష్మీ హాస్పిటళ్లలో బుధవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 'ఫైర్ డ్రిల్' నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ నర్సింహాచారి మాట్లాడుతూ ఆస్పత్రుల్లో అగ్నిమాపక యంత్రాలను అందుబాటులో ఉంచాలని, వాటిని వినియోగించే విధానంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా.. ముందుచూపుతో జాగ్రత్తలు తీసుకోవాలని, ఏదైనా ప్రమాదం జరిగిన తరువాత బాధపడి లాభం లేదన్నారు. అగ్ని ప్రమాదాలకు ముందు చూసే మంచిదన్నారు. అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విపత్తులు, అగ్నిమాపక నియంత్రణశాఖ ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్ని మాపకవారోత్సవాలు నిర్వహిస్తుందని తెలిపారు. మహాలక్ష్మీ డాక్టర్ జైలసింగ్, ఆస్పత్రి సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



పల్లకీసేవలో ప్రభుత్వ విప్



కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



తలంబ్రాలు పోసుకుంటూ..



స్వామికి మొక్కుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



అక్షింతలకు మొక్కుతున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్





తాళిబొట్టు కట్టుకుంటూ..



కల్యాణం తిలకిస్తున్న డీఎస్పీ కుటుంబీకులు



కల్యాణోత్సవానికి హాజరైన చైర్‌పర్సన్‌లు

నేత్రపర్వం.. రాములోరి కల్యాణం

వేములవాడ: జిల్లా వ్యాప్తంగా శ్రీసీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. భక్తుల రాకతో జిల్లాలోని శ్రీసీతారామ ఆలయాలు కిటకిటలాడాయి. దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మంగళవారం రాత్రి నుంచే భక్తుల రాకతో వేములవాడ పట్టణం రద్దీగా మారింది. చాలా మంది రోడ్లపైనే సేదతీరారు. మున్సిపల్ తరఫున కమిషనర్ అన్వేశ్, ప్రభుత్వం తరఫున ఆలయ ఈవో కృష్ణప్రసాద్ పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తులను మేళతాళాలతో వేదికపైకి తీసుకొచ్చారు. మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం సాగింది. కన్యాదాతలుగా భాను దంపతులు వ్యవహరించారు. శివపార్వతులు నెత్తిన జీలకర్ర, చేతిలో త్రిశూలం పట్టుకుని స్వామి వారిని వివాహమాడారు. గుడి చెరువు ఖాళీ స్థలంలో అన్నదానం చేశారు. చైర్మన్ చాంబర్ నుంచి వేదిక వద్దకు చేరుకునేందుకు పలువురు హిజ్రాలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. 12 బ్లాక్‌లుగా విభజించి బారికేడ్లు ఏర్పాటు చేయడంతో కల్యాణం ప్రశాంతంగా ముగిసింది. ఏర్పాట్లను ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఏఈవోలు హరికిషన్, బి.శ్రీనివాస్, జయకుమారి, ప్రతాప నవీన్ పరిశీలించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆర్డీవో రాజేశ్వర్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ బింగి మహేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికక్షేత్రంలో రాములోరి కల్యాణోత్సవం

సిరిసిల్లటౌన్: కార్మికక్షేత్రం సిరిసిల్లలోని వెంకన్న క్షేత్రంలో శ్రీసీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగింది. ప్రధాన అర్చకులు మాడంరాజు కృష్ణమాచారి జానకి–రాముల వివాహ ఘట్టాన్ని నిర్వహించగా ఆలయ ఈవో మారుతీరావు, ఏఈవోలు ప్రభాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



జోగినీల నృత్యాలు



సిరిసిల్లలో మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



ఉత్సవమూర్తులను వేదికపైకి తీసుకొస్తున్న సిబ్బంది



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మున్సిపల్, ఆలయ అధికారులు



రథోత్సవంలో నృత్యాలు చేస్తున్న హిజ్రాలు

అందరికీ ఓటరు స్లిప్పులు ఇవ్వాలి

- ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు

సిరిసిల్ల: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అందరికీ ఓటరు స్లిప్పులు అందించాలని, తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కోరారు. హైదరాబాద్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పెండింగ్ ఉన్న ఓటర్ నమోదు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, ఏప్రిల్ 26 నాటికి తుది ఓటరు జాబితాను రూపొందించాలని సూచించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని, స్లిప్పులు అందలేదనే ఫిర్యాదులు రావద్దన్నారు.

నేటి నుంచి నామినేషన్లు

ఏప్రిల్ 18న రిటర్నింగ్ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఏప్రిల్ 18 నుంచి 25 వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ, స్క్రుటినీ, ఉపసంహరణ, పోటీ చేసే తుది అభ్యర్థుల జాబితా ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ రూపకల్పన వంటి అంశాలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. నామినేషన్ స్వీకరణకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నామినేషన్ దాఖలుకు ముందు ప్రీ వెరిఫికేషన్ డెస్క్ వద్ద పరిశీలించాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి సాధ్యమైనంతవరకు ప్రత్యేక ఎంట్రీ ఎగ్జిట్ ఉండేలా చూడాలన్నారు. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణపై నిత్యం నివేదికలను సమర్పించాలని, ప్రతి రోజు దాఖలైన నామినేషన్, అభ్యర్థుల అఫిడవిట్లు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేశ్, రాజేశ్వర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

బద్దిపోచమ్మకు బోనం మొక్కులు



వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో చేసిన విన్యాసాలు అమితంగా ఆకట్టుకున్నాయి.



- మూడు రెట్ల వేతనం వదులుకొని సివిల్స్‌కు మొగ్గు
- సొంత మెటీరియల్‌తో రోజుకు 4 గంటలు చదివా
- సోషల్ మీడియాకు దూరంగా లేను
- పేదరికం, కుటుంబ సమస్యలు చూసి దిగులొద్దు
- ప్రణాళిక ప్రకారం చదివితే సివిల్స్ కష్టమేమీ కాదు
- 'సాక్షి'తో 27వ ర్యాంకర్ సాయికిరణ్

దేశసేవకు మించింది లేదు

'దేశ సేవకు మించింది లేదు.. సమాజానికి మేలు చేసే పనితో పోలిస్తే డబ్బుకు నా దృష్టిలో ప్రాధాన్యం లేదు.. అందుకే, మూడు రెట్ల అధిక జీతం వదులుకొని సివిల్ సర్వీస్‌లో చేరబోతున్నాను.. పేదలు, సమాజం కోసం పాటుపడేందుకు, వారిని ఆదుకునేందుకు సివిల్స్ గొప్ప వేదిక.. ఐదేళ్ల క్రితం మొదలైన సివిల్స్ వేట మొన్నటి ఫలితాలతో పూర్తయింది. పేదరికం, కుటుంబ సమస్యలు సివిల్స్ సాధనలో అసలు ఆటంకాలే కావు.. ప్రణాళిక ప్రకారం చదివితే సాధించడం కష్టమేమీ కాదు' అన్నారు సివిల్స్ ఆలిండియా 27వ ర్యాంకర్ నందాల సాయికిరణ్. తాను సివిల్స్‌కు ఎంపికైన తీరు, విజయం సాధించిన క్రమాన్ని బుధవారం తన స్వగ్రామం రామడుగు మండలంలోని వెలిచాలకు వచ్చిన సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్నారు.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్

కల కోసం శ్రమించాను..

సివిల్ సర్వీసెస్‌లో చేరాలన్న నా కల కోసం చాలా శ్రమించాను. చిన్నప్పటి నుంచి సమాజానికి ఏదైనా చేయాలన్న కోరిక ఉండేది. కానీ, ఏ ఉద్యోగం చేయాలన్నది మాత్రం అప్పుడే నిర్ణయించుకోలేదు. ఆర్ఈసీ వరంగల్‌లో ఇంజినీరింగ్ పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరాను. మంచి ప్యాకేజీతో ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. అయినా, ఏదో వెలితి. ఆ సమయంలో ఐఏఎస్ అయితే దేశానికి ఎలా సేవ చేయవచ్చో ఆలోచించాను. నా సివిల్స్ కలకు అక్కడే బీజం పడింది.



తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

మా నాన్న కాంతారావు చేనేత కార్మికుడు, అమ్మ లక్ష్మి బీడీ కార్మికురాలు. మాది మధ్య తరగతి కుటుంబం అని నేను ఏనాడూ కలత చెందలేదు. వారి శక్తి మేరకు నన్ను, నా సోదరిని బాగా చదివించారు. వారిచ్చిన ప్రోత్సాహంతోనే ఈ రోజు నా సివిల్స్ లక్ష్యాన్ని చేరుకోగలిగాను.

సాధిస్తానన్న నమ్మకంతో చదివా..

సివిల్ సర్వీసెస్ చదవడమంటే చాలా కష్టపడాలి. అందులోనూ కోచింగ్ లేకుండా, మరోవైపు ఉద్యోగం చేస్తూ చదవడమంటే మాటలు కాదు. కానీ, సాధిస్తానన్న నమ్మకంతో ప్రణాళిక ప్రకారం చదివా. సోషియాలజీని ఆప్షనల్‌గా ఎంచుకున్నాను. సొంతంగా నోట్స్ తయారు చేసుకున్నాను. కొంచెం ఇంటర్‌నెట్ నుంచి తీసుకునేవాడిని. ఉద్యోగానికి వెళ్లేవాడిని. రోజూ 3 నుంచి 4 గంటలు క్రమం తప్పకుండా చదివేవాడిని. వారాంతాల్లో మాత్రం పూర్తి సమయం చదివేందుకే కేటాయించేవాడిని. అలా క్రితం సారి సివిల్స్‌లో ఇంటర్వ్యూ వరకు వెళ్లా. అక్కడ కేవలం 18 మార్కులతో సివిల్స్ మిస్సయ్యాను. అయినా ఏమాత్రం నిరుత్సాహ పడలేదు. జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా మరింత కట్టుదిట్టంగా చదివాను. ముఖ్యంగా నేను రాసిన పేపర్లను థర్డ్ పార్టీ ఎవాల్యుయేషన్ చేయడం వల్ల నా సామర్థ్యం ఎప్పటికప్పుడు అంచనా వేసుకోగలిగాను. ఆన్‌లైన్‌లోనే మాక్ ఇంటర్వ్యూలకు ప్రిపేరవడం కలిసి వచ్చింది. సివిల్స్ ప్రిపేరవుతున్నా సోషల్ మీడియాకు దూరంగా లేను. నాకు ఎంత కావాలో అంత పరిమితి మేరకు వాడుకున్నాను.

పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం..

నేటి యువతకు సివిల్స్ కష్టమేమీ కాదు. కాకపోతే క్రమశిక్షణతో ప్లాన్ ప్రకారం చదువుకుంటూ పోవాలి. పేదరికం, కుటుంబ సమస్యలపై దిగులు పడొద్దు. పట్టుదలతో ప్రయత్నిస్తే విజయం తప్పకుండా దరిచేరుతుంది. బోలెడంత మెటీరియల్ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. మాక్ ఇంటర్వ్యూలు కూడా ఆన్‌లైన్‌లో అటెండ్ అవ్వొచ్చు.

క్లుప్తంగా

గల్ఫ్‌బోర్డు ఏర్పాటుపై హర్షం

ముస్తాబాద్‌(సిరిసిల్ల): తెలంగాణ గల్ఫ్‌ కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌ రెడ్డి గల్ఫ్‌ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం హర్షనీయమని గల్ఫ్‌ జేఏసీ నాయకుడు తోట ధర్మేందర్‌ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో బుధవారం మాట్లాడారు. 60 ఏళ్లుగా తెలంగాణ కార్మికులు గల్ఫ్‌ దేశాలకు వలస వెళ్లి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నైపుణ్యం లేకుండా గల్ఫ్‌ దేశాలకు వెళ్లి కూలీలుగా పనిచేసి, శ్రమదోపిడీకి గురయ్యారన్నారు. గల్ఫ్‌లో మృతిచెందిన కుటుంబాలను ఆదుకునేందుకు దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఎక్స్‌గ్రేషియాను ఈ కాంగ్రెస్‌ ప్రభుత్వం మళ్లీ అమలు చేసేందుకు ముందుకొచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. నిరుద్యోగ కార్మికులు గల్ఫ్‌ దేశాలకు వెళ్లేందుకు ప్రోత్సహకాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. గల్ఫ్‌ బాధిత కుటుంబాలకు చేయూతనివ్వడం ద్వారా గ్రామీణ కార్మిక కుటుంబాలు బాగుపడుతాయన్నారు.

జక్కుల చెరువు తూం విడిచిన గుర్తు తెలియని వ్యక్తులు



వృథాగా పోతున్న సాగునీరు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌ శివారులోని జక్కుల చెరువు తూంను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం తెల్లావారుజామున విడిచారు. ప్రస్తుతం చెరువులో నీరు పుష్కలంగా ఉన్న సమయంలో తూంను విడవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తూంను విడిచిపెట్టడంతో చెరువులోని సాగునీరు వృథాగా పోతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆయకట్టు రైతులు వెంటనే నీటి పారుదలశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. అధికారులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని రైతుల సహకారంతో తూంను మూసివేశారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టాలని ఆయకట్టు రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణానికి దేవాదాయశాఖ అధికారులు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కోరారు. ఆలయ పునర్‌నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం టీటీడీ ద్వారా రూ.3కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కానీ రూ.30లక్షల కంట్రిబ్యూషన్‌ను గ్రామస్తులు చెల్లిస్తే ఆ నిధులను నిర్మాణ పనులకు ఖర్చు పెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు బుధవారం హైదరాబాద్‌కు వెళ్లి దేవాదాయశాఖ అధికారులను కలిసి పునర్‌ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ప్రస్తుతం పార్లమెంట్‌ ఎన్నికల కోడ్‌ ఉన్నందున కోడ్‌ ముగియగానే టెండర్‌ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. అధికారులను కలిసిన వారిలో చందుపట్ల లక్ష్మారెడ్డి, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, ఎనగందుల నర్సింలు, యమగొండ పద్మారెడ్డి తదితరులు ఉన్నారు.

‘మావో’ళ్లు ఎట్లున్నరో..!?

- ఆ ఐదు కుటుంబాల్లో కలవరం !
- బస్తర్‌ అడవుల్లో కాల్పులు.. జిల్లా మనసుల్లో కలవరం
- అజ్ఞాత నక్సలైట్ల కుటుంబాల్లో ‘గుర్తు తెలియని’ గుబులు



ఎన్‌కౌంటర్‌ జరిగిన ఛత్తీస్‌గఢ్‌ కాంకేరు అటవీ ప్రాంతం(ఫైల్‌)

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్‌) మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఎక్కడ ఎన్‌కౌంటర్‌ జరిగినా.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలవరం మొదలవుతుంది. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలోని బస్తర్‌ అటవీ ప్రాంతంలోని కాంకేరు జిల్లా ఛోట్‌ బెటియా పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని బినాగుండ, కరోనార్‌ మధ్య హపటోలా, మాడ్‌ సమీప అటవీ ప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో 20 మంది పురుషులు కాగా, మరో తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. చనిపోయిన వారిలో ముగ్గురిని మాత్రమే గుర్తించగా.. చాలా మంది మావోయిస్టులను గుర్తించలేదు. పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్న మృతదేహాలలో మావోయిస్టు అగ్రనేత, దండకారణ్యం స్పెషల్‌ జోన్‌ కమిటీ, ఆర్‌కేబీ డివిజన్‌ కమిటీ కార్యదర్శి సుగులూరి చిన్నన్న అలియాస్‌ విజయ్‌, అలియాస్‌ శంకర్‌రావు ఉన్నట్లు గుర్తించారు. మరో స్పెషల్‌ జోన్‌ స్టేట్‌ మిలటరీ కమిషన్‌ ఇన్‌ఛార్జి రాంధర్‌ అలియాస్‌ మజ్జిదేవ్‌ ఉన్నట్లు పోలీసులు ప్రకటించారు. మృతుల సంఖ్య 29 నుంచి ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలుపగా.. ఆ గుర్తు తెలియని మావోయిస్టులు ఎవరు అనేది అంతు చిక్కడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఐదుగురు అజ్ఞాతంలో ఉంటూ.. మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గుర్తు తెలియని మావోయిస్టు మృతదేహాల్లో జిల్లా వాసులు ఎవరైనా ఉన్నారా..? అనే అనుమానం ఆ కుటుంబాలను కలవరానికి గురి చేస్తుంది. ‘మావో’ళ్లు ఎక్కడున్నారో.. ఎలా.. ఉన్నారో అని అజ్ఞాత వాసుల కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.

అజ్ఞాతంలో జిల్లా మావోయిస్టులు

సమసమాజ స్థాపన కోసం.. దున్నేవాడికే భూమి కావాలంటూ.. సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకుని రాజన్నసిరిసిల్ల జిల్లాకు చెందిన ఐదుగురు అజ్ఞాతంలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 114 మంది నక్సలైట్లు అజ్ఞాతంలో ఉన్నారని రాష్ట్ర పోలీస్‌ వర్గాలు ప్రకటించాయి. ఇందులో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఐదుగురు ఉన్నారు. ఇందులో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణరెడ్డి ఉరఫ్‌ కొసా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె వాసి. 42 ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉన్నారు. సత్యనారాయణరెడ్డి ఆయన తల్లిదండ్రులు చనిపోయినా.. ఇంటి ముఖం చూడకుండా.. దండకారణ్యంలో కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆయన తలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోటి రివార్డు ఉంది. కోనరావుపేట మండలం ధర్మారంకు చెందిన చంద్రయ్య అలియాస్‌ ఆజాద్‌, ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అలియాస్‌ భరత్‌, తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటకు చెందిన బాలసంతుల ఉప్పలయ్య అలియాస్‌ చిన్నన్నతోపాటు మరో ఒక్కరు అజ్ఞాతంలో ఉన్నారు. కోనరావుపేట మండలం శివంగాళపల్లెకు చెందిన జ్యోతి అలియాస్‌ జ్యోతక్క ఇటీవల పోలీసులకు లొంగిపోయారు. 20 ఏళ్ల పాటు అజ్ఞాతంలో ఉన్న జ్యోతి పోలీసులకు లొంగిపోయి స్వగ్రామంలో ఉంటుంది. బాలసంతుల ఉప్పలయ్య అలియాస్‌ చిన్నన్న మూడు దశాబ్దాలుగా ఎక్కడ ఉన్నారో.. ఎలా ఉన్నారో ఎవ్వరికీ తెలియదు. ఆయన మావోయిస్టు పార్టీలోనే ఉన్నాడా..? పార్టీని వీడి వెళ్లాడా.. ఇప్పటికే ఎన్‌కౌంటర్‌లో మరణించాడా తెలియదు. పోలీస్‌ రికార్డుల్లో మాత్రం చిన్నన్న ఇంకా అజ్ఞాతవాసిగానే ఉన్నాడు. తాజా పరిణామాలు మిగిలిన అజ్ఞాత మావోయిస్టుల కుటుంబాల్లో కలవరం నెలకొంది.

కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్‌లు..

జిల్లాలో అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నక్సలైట్ల కుటుంబ సభ్యులకు పోలీసులు పలుమార్లు కౌన్సెలింగ్‌ నిర్వహించారు. ఆయుధాలు వీడి లొంగిపోవాలని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. నక్సలైట్ల తలలపై ఉన్న రివార్డులను సైతం వారికే ఇస్తామని, పునరావాసం కల్పిస్తామని, కేసులు ఎత్తివేస్తామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అజ్ఞాత నక్సలైట్ల కుటుంబ సభ్యులకు వైద్యం చేయించడం.. చలికాలంలో దుప్పట్లు పంచడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆ అజ్ఞాత నక్సలైట్లు అనారోగ్యంతో ఉన్నా.. వారి ప్రాణాలకు హాని లేకుండా.. చూస్తామని జనజీవనంలో కలువాలని పోలీసులు ఆహ్వానించారు. కొంతమేరకు పోలీసుల ప్రయత్నం ఫలించింది. గతంలో సీపీఐ(ఎంఎల్‌) జనశక్తికి చెందిన 46 మంది సాయుధులు లొంగిపోయారు. మరో వైపు 2005 మార్చి 7న జరిగిన మానాలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు చనిపోవడంతో జిల్లాలో నక్సలైట్ల ప్రాబల్యం క్షీణించింది. కానీ జిల్లా వాసుల ఉద్యమ అజ్ఞాత వాసం కొనసాగుతుంది.

‘గుర్తు తెలియని శవాల’ గుబులు

ఇటీవల మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘఢ్‌, అటవీ ప్రాంతాల్లో తరచూ ఎన్‌కౌంటర్లు జరగడం... ఎక్కువ సంఖ్యలో మావోయిస్టులు మరణించడం, ఆయుధాలను పోలీసులకు స్వాధీనం చేసుకోవడం జరుగుతుంది. తాజాగా బస్తర్‌ శివారుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మరణించినట్లు పోలీసులు ప్రకటించినా.. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎన్‌కౌంటర్‌ జరిగిన ప్రతిసారి గుర్తు తెలియని వారిగా ప్రకటిస్తూ.. చాలా మంది మృతదేహాలను పోస్ట్‌మార్టమ్‌ అనంతరం పోలీసులే దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. దశాబ్దాల తరబడి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వారు అజ్ఞాతంలో ఉండడంతో వారి కుటుంబ సభ్యులు కూడా మృతదేహాలను గుర్తించలేని స్థితిలో ఉన్నారు. అనేక మంది అజ్ఞాత నక్సలైట్లు ‘గుర్తు’ తెలియని శవాలుగా దహనమైపోతున్నాయనే అనుమానాలు ఉన్నాయి. పొరుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఎదురు కాల్పులు జరిగినా.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలవరం మొదలవుతుంది. సీనియర్‌ అజ్ఞాత నేతలు మరణించినప్పుడు పోలీసులు ముఖ్యుల పేర్లను ప్రకటిస్తున్నారు. కానీ చాలా సందర్భాల్లో ఎన్‌కౌంటర్‌ శవాలు ఛిద్రమై ఉండడంతో గుర్తించడం కష్టంగా మారింది. మావోయిస్టు పార్టీ వర్గాలే మృతుల పేర్లను ప్రకటించాల్సి ఉంటుంది. కానీ అటు పోలీసులు, ఇటు మావోయిస్టు వర్గాలు మృతుల వివరాలు వెల్లడించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహాలు ఎవరివి అనే భయం వారి కుటుంబ సభ్యుల్లో గుబులు పుట్టిస్తుంది.

అజ్ఞాత వాసులపై పోలీసుల నిఘా..

జిల్లా వ్యాప్తంగా అజ్ఞాత నక్సలైట్లతోపాటు.. వారి కుటుంబ సభ్యులపైనా పోలీసులు నిఘా కొనసాగుతుంది. జిల్లా ఎస్పీ అఖిల్‌ మహాజన్‌ జిల్లాలో మవోయిస్టు నక్సలైట్ల కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారించారు. జిల్లాలో ప్రస్తుతం నక్సలైట్ల ఉనికి లేకున్నా.. అజ్ఞాతంలో ఐదుగురు ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు భావిస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 2005 వరకు మావోయిస్టులు, జనశక్తి నక్సలైట్ల ప్రాబల్యం అధికంగా ఉండేది. ఆయా పార్టీలో పనిచేసిన మాజీ నక్సలైట్లు ఇప్పటికీ ఉండడంతో వారి కదలికలపైనా నిఘా పెట్టారు. మరోవైపు నక్సలైట్లను పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు పోలీసులు మాజీ నక్సలైట్ల జీవన శైలిపైన దృష్టి సారించారు. పొరుగు రాష్ట్రాల్లో వరసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లు రాజన్న సిరిసిల్ల జిల్లాను కలవరపెడుతున్నాయి.

జనావాసాల్లో సిలిం‘డర్‌’!

- నిబంధనలను విస్మరిస్తున్న ఏజెన్సీలు
- ఇళ్ల మధ్యే గోడౌన్లు
- అటకెక్కిన అధికారుల పర్యవేక్షణ
- మామూళ్ల మత్తులో యంత్రాంగం



కోతిరాంపూర్‌లోని గోడౌన్‌లో సిలిండర్లను దించుతున్న దృశ్యం

కరీంనగర్‌ అర్బన్‌: ప్రజల ప్రాణాలతో చెలగాటమిది. ఏజెన్సీలు నిబంధనలను విస్మరించి వ్యవహరిస్తుంటే నియంత్రించాల్సిన యంత్రాంగం ‘మామూలు’గా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. అసలే వేసవి కాలం.. ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయికి చేరుతుండగా సకలవర్గాలు సతమతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో 4లక్షల జనాభా జీవనం సాగిస్తుండగా నివాసాల మధ్యే గ్యాస్‌ ఏజెన్సీలు సిలిండర్‌ గోడౌన్లను నిర్వహించడం అత్యంత ప్రమాదకరం. పేలుడు జరిగితే ఊహించని విస్ఫోటనమే. 10వేలకు పైగా ఎక్స్‌ప్లోజివ్‌ కెపాసిటీ కాగా సంబంధిత శాఖల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నివాసాల మధ్య నుంచి గోడౌన్లను తొలగించాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

అంతా ఇష్టారాజ్యం

నగరంలో 11 గ్యాస్‌ ఏజెన్సీలు ఉన్నాయి. హెచ్‌పీ, భారత్‌, ఇండెన్‌ కంపెనీలు గ్యాస్‌ సరఫరా చేస్తున్నాయి. కంపెనీల కేంద్రాల నుంచి లారీల ద్వారా గ్యాస్‌ సిలిండర్లు సరఫరా జరుగుతుండగా వాటిని ఆయా గ్యాస్‌ ఏజెన్సీలు గోడౌన్లలో దింపుకుని బుక్‌ చేసుకున్న వినియోగదారులకు డెలివరీ బాయ్స్‌ ద్వారా సరఫరా చేయడం జరిగే ప్రక్రియ. కాగా సిలిండర్లతో వచ్చిన లారీలు నిబంధనల ప్రకారం గోడౌన్‌ గేట్‌ బయట నిలపాలి. అక్కడి నుంచి కార్మికులు గోడౌన్‌లోకి ఒక్కొక్కటిగా తీసుకెళ్లి భద్రపరచాలి. సదరు లోడ్‌ వాహనం ఖాళీ అయిన తర్వాత డెలివరీ బాయ్స్‌ ఆటోలను గేట్‌ బయటే నిలిపి గోడౌన్‌ నుంచి ఒక్కో గ్యాస్‌ బండను తెచ్చి ఆటోలో వేసుకోవాలి. ఇవీ నిబంధనలు కాగా.. హెచ్చు గ్యాస్‌ ఏజెన్సీలు వాటిని అటకెక్కించాయి. దర్జాగా ఏకంగా గోడౌన్లోకి భారీ లోడ్లతో వాహనాలు వెళుతుండగా అక్కడే ఆటోలో సిలిండర్లను లోడ్‌ చేస్తున్నారు. పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తుండగా పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు అటువైపు కన్నెత్తిచూడకపోగా కార్యాలయాల్లోనే అన్నీ సక్రమమని మామూలుగా వ్యవహరిస్తున్నారు. గ్యాస్‌ లీకేజీ, కార్మికులు పొగ తాగడం, తదితర నిర్లక్ష్యం మూలంగా భారీ విధ్వంసం జరిగే అవకాశముంది. ఏ చిన్న లీకేజీ ఏర్పడిన ఊహించని నష్టం.. కాలనీలకుకాలనీలే శవాల దిబ్బగా మారే పరిస్థితి.

తనిఖీలు తూచ్‌

గ్యాస్‌ ఏజెన్సీ కార్యాలయాలు ఇళ్ల మధ్య, గోడౌన్లు నివాసాలు లేని శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నది నిబంధన. కానీ అత్యధిక ఏజెన్సీల గోడౌన్లు నివాసాల్లో ఉండటం ఆందోళనకర పరిణామం. గోడౌన్‌కు పటిష్టమైన గోడ.. గేట్‌ ఉండాలి. ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగినా దీనివల్ల నష్టాన్ని నివారించే పరిస్థితి ఉంటుంది. అయితే, కొన్ని గ్యాస్‌ ఏజెన్సీల్లో మినహా ఇవేవీ ఎక్కడా కనిపించవు. చుట్టూ బహుళ అంతస్తుల భవనాలుండగా గోడౌన్లు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు శివారు ప్రాంతమైనా నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలిన యంత్రాంగం కళ్లున్నా కబోదిలా వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం నిర్మాణముందా, వ్యవహరిస్తున్నారా..ననేది అగ్నిమాపక శాఖ పర్యవేక్షించాల్సి ఉండగా, లైసెన్స్‌ రెనివల్‌ రెవెన్యూ శాఖ నిర్వహించాల్సి ఉండగా ఏవైనా అక్రమాలు జరుగుతున్నాయా, స్టాక్‌ ఎంత, ఎంత డెలివరీ అయిందనే కోణంలో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఇంకా నివాసాల మధ్య గోడౌన్లు నిర్వహిస్తున్నారంటే అధికారులు ఎంత నిబద్ధతతో పనిచేస్తున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కాగా, ఈ విషయమై సంబంధిత శాఖల అధికారులను ‘సాక్షి’ వివరణ కోరగా.. గ్యాస్‌ ఏజెన్సీలు నిబంధనల ప్రకారం వ్యవహరించాలి. తనిఖీలు చేసి చర్యలు చేపడతామని సంబంధిత శాఖల అధికారులు వివరించారు. అధికారులు చర్యలు తీసుకుంటారా.. లేదా.. వేచిచూడాల్సిందే.

కేటీఆర్‌ను నమ్ముకుంటే సెల్ఫీలే మిగిలాయి

- ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్‌ నేవూరి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న నేవూరి వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల: బీఆర్‌ఎస్‌ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె.తారక రామారావును నమ్ముకుని పదేళ్లు పని చేస్తే.. సెల్ఫీలు, అవమానాలే మిగిలాయని ఎల్లారెడ్డిపేట మేజర్‌ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్‌, కాంగ్రెస్‌ నాయకుడు నేవూరి వెంకటరెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అంకితభావంతో బీఆర్‌ఎస్‌కు, కేటీఆర్‌ కోసం పని చేసేనోళ్లు బిచ్చమెత్తుకునే పరిస్థితి ఎదురైందన్నారు. సర్పంచ్‌లకు లక్షల్లో బిల్లులు పెండింగ్‌ పెట్టారని, తనకు రూ.80లక్షలు రావాల్సి ఉందన్నారు. పదేళ్లుగా తాను, తన భార్య ఎల్లారెడ్డిపేట సర్పంచ్‌గా బీఆర్‌ఎస్‌లో పనిచేసి చాలా నష్టపోయామన్నారు. పార్టీ కోసం, కేటీఆర్‌ కోసం ఎంతో పనిచేసినా.. జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకుని రాజకీయంగా ఎదగకుండా చేశారని ఆరోపించారు. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారంలో రూ.50కోట్ల నష్టం వచ్చినా.. కేటీఆర్‌ మాట సాయం కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే ఆయన సామాజికవర్గం వారికి అన్ని పనులు చేశారన్నారు. బీఆర్‌ఎస్‌లో ఆయన బంధువులు, అనుయాయులు తప్ప ఎవరూ సంతోషంగా లేరన్నారు. నేతకార్మికులకు రూ.260కోట్ల బతుకమ్మ చీరల బకాయిలు ఆపింది కేటీఆర్‌ కాదా? అని ప్రశ్నించారు. కొమిరిశెట్టి తిరుపతి, కౌన్సిలర్లు రెడ్డి నాయక్‌, కుడిక్యాల రవికుమార్‌, అర్బన్‌ బ్యాంకు డైరెక్టర్‌ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్‌ పాల్గొన్నారు.

అమ్మను కొడుతున్నారు.. చర్యలు తీసుకోండి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాలికలు
- కౌన్సెలింగ్‌ ఇస్తున్న పోలీసులు



పోలీస్‌స్టేషన్‌లో బాలికలు సమ్మక్క, సంధ్య

జగిత్యాలక్రైం: అమ్మను నిత్యం అకారణంగా కొడుతూ హింసిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఇద్దరు బాలికలు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల జిల్లాకేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన మొగిలి రాజ్‌కుమార్‌, గంగవ్వకు నలుగురు సంతానం. పెద్ద కూతురు సారక్క వివాహమైంది. సమ్మక్క (13), సంధ్య (9), కుమారుడు సృజన్‌(7). కొద్దిరోజుల క్రితం గంగవ్వ ఆడబిడ్డ రేష్మ సృజన్‌ను తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో గొడవలు జరుగుతున్నాయి. రేష్మతోపాటు అత్త రాధ కలిసి కొద్దిరోజులుగా గంగవ్వపై దాడిచేస్తున్నారు. మంగళవారం రాత్రి కూడా గంగవ్వపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గంగవ్వ కూతుళ్లు సమ్మక్క, సంధ్య బుధవారం ఉదయం తమ తల్లిని తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు వారిని పిలిపించే ప్రయత్నం చేయగా వారు అందుబాటులో లేరు. పోలీసులే వారు అద్దెకుంటున్న ఇంటి వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. తమ తల్లిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని రోదించారు. సాయంత్రం రేష్మతోపాటు గంగవ్వ భర్తను పిలిపించి కౌన్సెలింగ్‌ నిర్వహించారు.

నామినేషన్లకు వేళాయె..

- నేడు ఎన్నికల నోటిఫికేషన్‌.. నామినేషన్లకు శ్రీకారం
- ఉదయం 11నుంచి సాయంత్రం 3 వరకు స్వీకరణ
- చిన్న తప్పున్నా తిరస్కరణే.. నిబంధనలు కఠినతరం
- రెండో గేట్‌ నుంచే ఉద్యోగులు, ప్రజల రాకపోకలు

ఎన్నికల షెడ్యూల్‌ ఇలా

నామినేషన్ల నోటిఫికేషన్‌ జారీ: ఏప్రిల్‌ 18
స్వీకరణ: ఏప్రిల్‌ 18 నుంచి 25
పరిశీలన: ఏప్రిల్‌ 26
ఉపసంహరణకు చివరి తేదీ: ఏప్రిల్‌ 29
పోలింగ్‌: మే 13
ఓట్ల లెక్కింపు: జూన్‌ 04

కరీంనగర్‌ అర్బన్‌: సార్వత్రిక ఎన్నికల సమరానికి ప్రధాన ఘట్టం నేటి నుంచే ప్రారంభం కానుంది. నేడు ఉదయం 10గంటలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్‌ విడుదల చేసిన గంట నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఇందుకు కరీంనగర్‌ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కరీంనగర్‌ లోక్‌సభ స్థానం పరిధిలో రాజన్న సిరిసిల్లతో పాటు సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌ నియోజకవర్గం ఉండగా కరీంనగర్‌ కలెక్టరేట్‌లో నామినేషన్లను స్వీకరించనుండగా కలెక్టర్‌ పమేలా సత్పతి ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే కలెక్టరేట్‌ ప్రాంతంలో కట్టుదిట్టమైన పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేయగా 144 సెక్షన్‌ విధించారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరించనుండగా హెల్ప్‌లైన్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులు, ప్రజలు రెండోగేట్‌ నుంచి రాకపోకలు సాగించేలా ఏర్పాటు చేశారు.

జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీకి ఒకరి ప్రతిపాదన చాలు

జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్‌ వేసే సమయంలో అదే లోక్‌సభ నియోజకవర్గంలో ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాలి. అభ్యర్థి మాత్రం రాష్ట్రంలో ఏ నియోజకవర్గం నుంచైనా ఓటరై ఉండాలి. అదే రిజిస్టర్‌ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్‌ వేస్తే నియోజకవర్గానికి చెందిన పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. ప్రతిపాదించేవారు నిరక్షరాస్యులైతే ఆర్వో ఎదుట నామినేషన్‌ స్వీకరణ సమయానికి ముందు, తర్వాత వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ఇక ప్రతిపాదించే వారి సంతకాన్ని అభ్యర్థులు ఫోర్జరీ చేసినట్లు విచారణలో తేలితే నామినేషన్‌ తిరస్కరణకు గురికావడంతో పాటు కేసు నమోదు చేయనున్నారు.

ఫాం 2 ద్వారా నామినేషన్‌

పార్లమెంట్‌ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఫాం 2–బీ ద్వారా నామినేషన్‌ వేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఫాం–26 ద్వారా అఫిడవిట్‌ దాఖలు చేయాలి. దీంట్లో అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలు ఆస్తులు, రాబడి, ఖర్చు, అప్పులు, క్రిమినల్‌ కేసులు, రాబడి పన్ను నమోదు చేయాలి. అఫిడవిట్లో అన్ని కాలమ్‌లు పూరించాలి. ఏదైనా కాలమ్‌ వదిలి వేసినట్లయితే ఆర్వో నుంచి నోటీసు అందుకోవాల్సి వస్తుంది.

అభ్యర్థితో నలుగురికి అవకాశం

నామినేషన్‌ కేంద్రాలకు వెళ్లడానికి అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. అభ్యర్థి వెంట మూడు వాహనాలకు మాత్రమే అనుమతినిస్తారు. రిటర్నింగ్‌ ఆఫీస్‌కు వంద మీటర్ల దూరం వరకు వెహికిల్స్‌కు అనుమతి ఉంటుంది. అభ్యర్థులు నామినేషన్‌తో పాటు అభ్యర్థులు బ్యాంకు ఖాతా వివరాలను ఆర్వోకు అందజేయాలి. ఏదైనా జాతీయబ్యాంకు నుంచి కొత్తగా ఖాతా తెరవాలి. ఎన్నికలు పూర్తయ్యే వరకు అదే ఖాతా నుంచి లావాదేవీలు నిర్వహించాలి. లోక్‌సభ అభ్యర్థిగా నామినేషన్‌ వేసే సాధారణ అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్‌ చేయాలి. ఎస్సీ, ఎస్టీలైతే రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుంది. నామినేషన్‌ స్వీకరణ కేంద్రాల్లో నగదు స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు తెరుస్తున్నారు.

నామపత్రాలు పొందొచ్చు

కలెక్టరేట్‌లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వీటిని అభ్యర్థులు, వారి తరపున హాజరయ్యే వారి నుంచి స్వీకరిస్తారు. ఈ నెల 21న ఆదివారం సెలవుదినం కావడంతో ఆ రోజు స్వీకరణ ఉండదు. అభ్యర్థి నాలుగు సెట్ల నామపత్రాలు అందజేయవచ్చు. ఖాళీ నామినేషన్‌ సెట్లను నేటి నుంచి కలెక్టరేట్‌ ఆర్వో కార్యాలయం నుంచి పొందవచ్చని అధికారులు వివరించారు.

నీడలా నిఘా.. సహాయ కేంద్రం

కలెక్టర్‌ కార్యాలయంలో నిఘాను తీవ్రతరం చేశారు. కలెక్టర్‌ చాంబర్‌ కారిడార్‌తో పాటు సముదాయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు, పార్టీల వారికి సహకరించేందుకు ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిరోజు సాయంత్రం 3 గంటల తరువాత రోజువారీ నామినేషన్‌ వివరాలను ఈసీ వెల్లడించనుంది. నామినేషన్‌ దాఖలు చేసిన ప్రతి అభ్యర్థి అఫిడవిట్‌ పత్రాలను 24గంటల్లోనే ఎలక్షన్‌ వెబ్‌సైట్‌లో ప్రదర్శించనున్నారు. కలెక్టరేట్‌ నామినేషన్ల స్వీకరణ కేంద్రం కాగా 100 మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్‌ అమల్లో ఉంటుంది. ర్యాలీగా వచ్చే అభ్యర్థులు కలెక్టర్‌ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే ర్యాలీని ఆపేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకోనున్నారు.


మేకను కాపాడబోయి అనంతలోకాలకు

- గిద్దె చెరువులో పడి యువకుడి మృతి
- పండుగపూట విషాదం
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు



సాయికృష్ణ(ఫైల్‌)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని ఓ మేక ప్రమాదవశాత్తు చెరువులో పడగా..దానిని కాపాడే ప్రయత్నంలో మేకల కాపారి ఊపిరాడక మృతిచెందాడు. శ్రీరామ నవమి పండుగ రోజు ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మేకను కాపాడబోయి ఎంతో భవిష్యత్‌ ఉన్న యువకుడు మరణించడం అందరిని కలచివేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మిర్యాల్‌కర్‌ సాయికృష్ణ(25) స్థానిక గిద్దె చెరువులో పడి బుధవారం మృతి చెందాడు. రోజు మాదిరిగానే సాయికృష్ణ మేకలను మేపడానికి గిద్దె చెరువు ప్రాంతానికి వెళ్లాడు. ఈక్రమంలో మందలోని ఒక మేక ప్రమాదవశాత్తు చెరువులో పడింది. ఆ మేకను కాపాడేందుకు సాయికృష్ణ చెరువులోకి దిగగా.. మేక చిక్కుకున్న ఊబిలోనే పడి ఊపిరాడక మరణించాడు. ఆ సమయంలో సాయికృష్ణ కేకలు వేసినప్పటికీ ఆ ప్రాంతంలో ఎవరు లేకపోవడంతో చెరువులోనే తుదిశ్వాస విడిచాడు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్‌ సంఘటన స్థలానికి వెళ్లి చెరువులోంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. సాయికృష్ణ మరణవార్త విని కుటుంబ సభ్యులు దుఃఖ సముద్రంలో మునిగిపోయారు. పండుగపూట కొడుకు మరణించడంతో ఆ తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. మృతునికి తల్లితండ్రులు లక్ష్మిబాయి–కిషన్‌, సోదరులు వినిత్‌, దేవిలాల్‌ ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్‌ తెలిపారు.



నారాయణపూర్‌లో..

కనులపండువగా రథోత్సవం

వేములవాడ/సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శ్రీరామనవమిని పురస్కరించుకొని బుధవారం సాయంత్రం వేములవాడ, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేటల్లో రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వేములవాడలో రథోత్సవం సందర్భంగా హిజ్రాలు, జోగినీల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేక హోమగుండంలో పూర్ణాహుతి నిర్వహించారు.



సిరిసిల్లలో..